క్లుప్తంగా

నీటి ట్యాంకు పరిశీలన

నాగార్జునసాగర్: నందికొండలో కోతులు పడిన నీటిట్యాంకును అదనపు కలెక్టర్ పూర్ణచందర్ గురువారం పరిశీలించారు. నీటిట్యాంకులోకి నీరు వెళ్లకుండా సీల్ వేయించడం తోపాటు, ట్యాంకు నుంచి నీరు బయటకు రాకుండా సీల్ వేయించారు. ఆయన వెంట పెద్దవూర తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారు లున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

డిండి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం తాటికోల్ వాగు నుంచి డిండి వైపు ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చెర్కుపల్లి గేటు సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ నడుపుతున్న పందుల కొండల్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 2.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన గురువారం డిండి మండలంలోని సింగరాజుపల్లిలో చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుండా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఇంటి యజమాని రాధా పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో భాగంగా శుక్రవారం పట్టణంలోని బంగారుగడ్డ, ఇస్లాంపురం, డాక్టర్స్‌కాలనీ, విద్యానగర్, సీతారాంపురం, అశోక్‌నగర్, సంతోష్‌నగర్, శాంతినగర్, కృష్ణకాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ కోడిరెక్క రవికుమార్ గురువారం తెలిపారు. గృహ, వ్యాపార విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చట్టసభల్లో బీసీల సంఖ్య పెరగాలి



మాట్లాడుతున్న పాలకూరి రవిగౌడ్

నల్లగొండ టూటౌన్: చట్ట సభల్లో బీసీల సంఖ్య పెరగాలని, బడుగు, బలహీనవర్గాల ప్రజలందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పాలకూరి రవిగౌడ్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కార్యాలయాన్ని ప్రారంభించి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు జనాభాలో 50 శాతం ఉన్నప్పటికీ రాజకీయాల్లో వెనుకబడి పోయారన్నారు. కొన్ని సామాజిక వర్గాలు బీసీలపై వివక్ష చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల సమస్యల పరిష్కారానికి వేదిక ఉద్యర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, రాజకీయ సర్పంచాధ్యక్ష, అఖిలభారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మల్లికార్జున్ గౌడ్, జక్కల సుధాకర్‌యాదవ్, నరసింహ, నరేష్‌గౌడ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో గెలిచి మోదీకి బహుమతిగా ఇస్తాం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ భారీ మెజార్టీతో గెలవబోతుందని, నల్లగొండలో గెలిచి మోదీకి బహుమతిగా ఇస్తామని బీజేవైఎం జిల్లా కార్యదర్శి గుండ్లపల్లి శాంతిస్వరూప్ అన్నారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం నాయకులు నందిపాటి శ్రీకాంత్, చెరుకుపల్లి సాయికుమార్, లోహిత్‌రెడ్డి, చిట్యాల గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతిస్వరూప్

● రోడ్ల పక్కనే వ్యర్థాలు

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రోడ్లపక్కనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్ దుకాణాల నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. డంపింగ్ యార్డులను ఉపయోగించుకోకుండా ఇలా రోడ్లపక్కన చెత్తను డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– కొండమల్లేపల్లి



రోడ్డు పక్కనే పడేసిన చికెన్ వ్యర్థాలు



రోడ్డు పక్కనే డంప్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



పేరుకుపోయిన చెత్తాచెదారం

పన్ను వసూలు 70.88 శాతమే..

- హాలియా మున్సిపాలిటీలో నెరవేరని ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం
- టార్గెట్ రూ.2.13కోట్లు
- వసూలైంది రూ.1.37కోట్లు
- ముగిసిన ఆర్థిక సంవత్సరం



హాలియా మున్సిపాలిటీ కార్యాలయం

హాలియా: హాలియా మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలులో లక్ష్యం చేరుకోలేదు. మున్సిపాలిటీలో మొత్తం రూ. 2.13కోట్ల టార్గెట్‌కు ఆర్థిక సంవత్సరం ముగిసిన నాటికి 70.88 శాతం మాత్రమే వసూలయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 5,462 ఇళ్లు ఉండగా రూ.కోటి 37లక్షలు మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా 1300 ఇళ్లకుగాను రూ.63,13,000 బకాయిలు ఉన్నాయి. హాలియా మున్సిపాలిటీలో పన్ను వసూలు చేసే క్రమంలో మొండి బకాయిదారుల కోసం 90 శాతం వడ్డీ రాయితీతో ఓటీఎస్ స్కీం తీసుకువచ్చినా ఆశించిన ఫలితాలు రాలేదు.

ఆదాయం సమకూర్చుకోవడానికి..

మున్సిపాలిటీలకు సాధారణ నిధి కింద వచ్చే నల్లా పన్నుతో పాటు దుకాణాల అద్దె, వర్తక పన్ను, వాణిజ్య ప్రకటనలపై వచ్చే ఆదాయంతో పోలిస్తే ఆస్తి పన్ను కీలకం. దీనిని బకాయిలు లేకుండా వసూలు చేయడం ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం మార్చి 31 వరకు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే మున్సిపాలిటీలకు ఆస్తి పన్ను వసూళ్లు తలనొప్పిగా మారుతోంది. ఎప్పటికప్పుడు వసూలు చేయగలిగితే తప్ప పూర్తి స్థాయిలో పన్నుల వసూళ్లు సాధ్యం కావడం లేదు. ఒక్కోసారి బకాయిలు పేరుకుపోయి మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు నిలిచి పోవడంతో పాటు బిల్లుల చెల్లింపులు, సిబ్బంది, కార్మికుల జీత భత్యాలకు కష్టంగా మారుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత మేరకు మార్చి 31లోగా పన్నుల వసూళ్లను పూర్తి చేస్తున్నారు.

ప్రత్యేక అధికారులను నియమించినా..

మున్సిపాలిటీలో నిర్దేశిత గడువు ముగిసేనాటికి రూ.2 కోట్ల 13లక్షల పన్ను వసూలు చేయలేకపోయారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటం, ప్రజాపాలనలో అధికారులు భాగస్వాములు కావడంతో ఆస్తి పన్ను వసూళ్లను పట్టించుకోలేదు. దీనికితోడు ఇటీవల పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడం.. అన్నింటికి మించి ప్రత్యేక అధికారులను నియమించినా ఆశించిన ఫలితాలు రాలేదు.

విస్తృతంగా ప్రచారం చేశాం



ఆస్తిపన్ను చెల్లించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశాం. సిబ్బంది అందుకు అనుగుణంగా పని చేశారు. ప్రతి ఒక్కరు ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. హాలియా మున్సిపాలిటీలో మార్చి 31వ తేదీ నాటికి 70. 88 శాతం పన్ను వసూలు చేశాం.

– ముస్సర్ అలీ, మున్సిపల్ కమిషనర్

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరాములు

దేవరకొండ: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. గురువారం దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓపీఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని సూచించారు. మరో రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగనున్నట్లు తెలిపారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే విధులపై మాస్టర్ ట్రైనర్లు ఓపీఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేణికుంట్ల రాజశేఖర్, శ్రీనివాస్, శేఖర్, రమేష్, గోవర్ధన్, నరేష్ తదితరులున్నారు.

కలెక్టర్‌కు నివేదిక

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లికి చెందిన రైతు బంటు లక్ష్మయ్య వరి పొలం ఎండిపోవడంతో సదరు రైతు పంటకు నిప్పు పెట్టిన కథనం గత నెల 18న సాక్షిలో ప్రచురితమైంది. ఈ విషయమై కలెక్టర్ పాటించడంతో ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఈఈ ఆర్.లక్ష్మణ్ గురువారం నివేదిక పంపారు.

చెరువు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామ శివారులో ఉన్న చెరువు, పాలేరు చెక్‌డ్యాం ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి చదును చేసిన భూమిని గురువారం నీటిపారుదల శాఖ ఏఈ సాయిరెడ్డి సందర్శించారు. చెరువు, పాలేరు చెక్‌డ్యాం వెంట వ్యవసాయ భూములున్న కొందరు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి పూడుస్తున్నారని స్థానికులు ఏఈ దృష్టికి తీసుకురావడంతో గురువారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధి భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వారిని మందలించారు. వ్యవసాయశాఖ మార్గదర్శకాలు లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్

చింతపల్లి: మండల కేంద్రంలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిలో ఉన్న శ్రీగట్టుల క్ష్మీ మైసమ్మ దేవాలయ ఉత్సవాల సందర్భంగా గురువారం ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. చుట్టుపక్కల గ్రామాలైన గడియగౌరారం, వర్మాల, నసర్లపల్లి, తుంగపాడు, కొక్కిరాలతండా, వింజమూరు, తదితర గ్రామాల నుంచి ప్రజలు ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉజ్జిని విద్యాసాగర్ రావు, వల్లా ప్రవీణ్‌రెడ్డి, వందనపు ఆంజనేయులు, బిచ్చానాయక్, రఘురాంరావు, బాలేసింగ్, చంద్రశేఖర్, శంకర్, వెంకటయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి మేడారం ఎంపీటీసీ



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమావత్ రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని మేడారం ఎంపీటీసీ సభ్యుడు నక్క రాములు గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏఏల్లారి వల్లపురెడ్డి, ప్రధాన కార్యదర్శి తొడుకూరి పరమేష్, ఎర్ర యాదగిరి, సుధాకర్ గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి

చందంపేట: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చందంపేట మండలంలోని పోలేపల్లి స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు సిరాజ్ ఖాన్, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ బుజ్జి, శ్రీశైలం యాదవ్, కేతావత్ హెమ్లా నాయక్, భద్యానాయక్, లోకసాని కృష్ణయ్య, వెంకటయ్య, మల్లయ్య, సాదిక్, రాంసింగ్, హరికృష్ణ, ఎంకులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

దేవరకొండ: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తా వద్ద ఈద్గా, మక్కా మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, నాయకులు ఎంఏ సిరాజ్ ఖాన్, వేణుధర్‌రెడ్డి, గౌరీ శంకర్, హజీమ్, మాజిద్ మౌలానా, దస్తగిరి, ఖాజా, మొయిన్, నవీద్, హరికృష్ణ, ఈద్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అభి




చిల్లంచర్ల అభి

మిర్యాలగూడ టౌన్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధికార ప్రతినిధిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన చిల్లంచర్ల అభి నియమితులయ్యారు. ఈమేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని మోర్చా కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా అభి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌తో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోతుల మృతి ఘటనను రాజకీయం చేస్తున్నారు

● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



కోతులు పడిన నీటిట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: నందికొండలోని వాటర్ ట్యాంక్‌లో పడి కోతులు చనిపోయిన ఘటనను బీఆర్ఎస్ నాయకులు రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నందికొండలో కోతులు పడి చనిపోయిన నీటి ట్యాంకును ఆయన పరిశీలించి మాట్లాడారు. కోతుల కళేబరాలు ఉన్న వాటర్‌ట్యాంకు నుంచి కేవలం 9 ఇళ్లకే నీరు సరఫరా అవుతుందని, కోతులు పడగానే నీటి సరఫరా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారని అన్నారు. ఆ తొమ్మిది ఇళ్లకు వేరే దగ్గర నుంచి కొత్త కనెక్షన్లు ఇచ్చి ఈ ట్యాంకులోకి నీరు వెళ్లకుండా సీల్ వేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నీటి ట్యాంకులను సీల్ చేయాలని, వన్యప్రాణులు, మూగజీవాల దాహార్తికి నీటితొట్లు నిర్మించేందుకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

నందికొండ అంతా బీఆర్ఎస్ నాయకుల కబ్జాలు, అక్రమ కట్టడాలే..

బీఆర్ఎస్ పాలకులు నందికొండలోని స్థలాలన్నీ కబ్జాలపాలు చేయడంతో పాటు, అక్రమ నిర్మాణాలు చేసి విక్రయించారని ఎమ్మెల్యే ఆరోపించారు. అక్రమ కట్టడాలను కూల్చొట్టడంతో పాటు ఆక్రమిత స్థలాలను ప్రభుత్వానికి అప్పజెప్పుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఈశ 19క్వార్టర్ తమ నివాసమంటూ రాజకీయం చేయడం భావ్యం కాదన్నారు. సమావేశంలో తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులున్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరం సునీత

డిండి: వేసవిని దృష్టిలో ఉంచుకొని డిండి మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి హాజరైన వివిధ శాఖల మండలాధికారులు తమ నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా 13 మంది ఎంపీటీసీలకు ఐదుగురు మాత్రమే హాజరుకావడంతో సమావేశం నామమాత్రంగానే జరిగింది. సమావేశంలో ఎంపీడీఓ దానియల్, వైస్ ఎంపీపీ పుల్లమ్మ, ఆర్ఐ శ్యామ్‌నాయక్, పీఆర్ఏఈ విజయ్‌కుమార్, విద్యుత్ ఏఈ విజయ్‌ప్రకాష్, పీహెచ్‌సీ మండల వైద్యురాలు శైలి, ఇంచార్జి సూపరింటెండెంట్ రేణుకారెడ్డి, గ్రామ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ భవనంలో పుచ్చకాయల వ్యాపారం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలో గల పర్సర్ల బావి సమీపంలో గల పశువుల సంత వద్ద సుమారు రూ.33లక్షలతో చేపల మార్కెట్ భవనాన్ని నిర్మించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందు దీనిని ప్రారంభించారు. కానీ ఈ భవనంలో పుచ్చకాయలు నిల్వ ఉంచుతున్నారు. మత్స్యకారులకు కేటాయించిన భవనాన్ని ఇలా పుచ్చకాయల వ్యాపారం చేసే వారు వినియోగించుకుంటుండడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వీరబాబును వివరణ కోరగా.. ప్రభుత్వం చేపల వ్యాపారం చేసుకునే వారికి కేటాయించిన భవనాన్ని పుచ్చకాయల వ్యాపారానికి ఉపయోగించుకోవడం సరైనది కాదన్నారు. చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చేపల మార్కెట్ భవనంలో నిల్వ చేసిన పుచ్చకాయలు

జిజ్ఞాస పోటీల్లో కేఎన్ఎం విద్యార్థుల ప్రజెంటేషన్



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్: హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో మిర్యాలగూడలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 'అప్లికేషన్స్ ఆఫ్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్' అనే అంశంపై గణిత శాస్త్ర విభాగం విద్యార్థులు, 'నాగార్జునసాగర్ వద్ద బౌద్ధ మత స్థలాలు' అనే అంశంపై చరిత్ర శాఖ విద్యార్థులు ప్రజెంటేషన్ ఇచ్చారు. సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో నర్సింగ్ కోటయ్య, నాగరాణి తదితరులున్నారు.

దీక్షను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు శుక్రవారం కోదాడలో నిర్వహించబోయే రైతు దీక్షను విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంబ్ల నరేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డితో పాటు నాయకులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిచేసిన శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో పెదురుమంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. రవంతరంగా రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మండపవ్యపారాన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను జయప్రదం చేయాలి

మఠంపల్లి : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 6న కాంగ్రెస్ పార్టీ నిర్వహించే జనజాతర బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ కోరారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, ఆలిండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా పాల్గొని కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టోను ప్రకటిస్తారని తెలిపారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అనుజారెడ్డి, మాజీ సర్పంచ్ బుజ్జిభీముడునాయక్, తులసీరాంనాయక్ పాల్గొన్నారు.

6న జనజాతర సభ

మద్దిరాల: ఈనెల 6న తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర సభ ఉంటుందని, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాజానాయక్, లక్ష్మణ్‌నాయక్, విజయానాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీ మోడల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌వీ మోడల్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఒరుగంటి శ్యామసుందర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి భవిష్యత్‌లో వివిధ రంగాల్లో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఒరుగంటి విశాలక్ష్మి, ఇన్‌చార్జ్ నాగలక్ష్మి, రమ్య, నాగరాణి, విజయకుమారి, సుమతి, నాగసుధ, వరలక్ష్మి, చైతన్య, రత్నమాల, అష్రఫ్, సౌజన్య, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు